


జిల్లాలో 213 నీటి వినియోగదారుల సంఘాలు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

జిల్లాలో 213 నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన జారీచేశారు. సాగునీటి సంఘాలకు నవంబర్ 21 నుంచి 29వ తేదీ వరకు వివిధ దశలలో ఎన్నికలు నిర్వహించుటకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినట్లు చెప్పారు. జిల్లాలో పెద్దతరహా నీటిపారుదల వనరుల కింద తోటపల్లి జలాశయం వస్తుందని తెలిపారు. ఇందులో నీటి వినియోగ దారుల సంఘాలు 22, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 4, ప్రాజెక్ట్ కమిటీ ఒకటి ఉన్నట్లు చెప్పారు. మధ్య తరహా నీటిపారుదలలో భాగంగా నీటి వినియోగ దారుల సంఘాలు 25, ప్రాజెక్ట్ కమిటీలు 4, చిన్న నీటి పారుదల వనరుల్లో భాగంగా నీటి వినియోగదారుల సంఘాలు 166 ఉన్నాయని తెలిపారు. వీటిని 1560 ప్రాదేశిక ప్రాంతాలుగా విభజించినట్లు వివరించారు.

గిరిజనుల సమస్యల పట్టవా?

- సాగు భూములకు పట్టాలివ్వాలి
- జిఒ 3ను రద్దు చేయాలి
- ఆదివాసీ గిరిజన సంఘం, సిపిఎం ఆధ్వర్యాన ఆందోళనలు



పార్వతీపురూరల్.. తహశీల్దార్‌కు గిరిజనుల సమస్యలను వివరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజన గ్రామాల్లో కనీస సౌకర్యాల లేమిపై ఆదివాసీలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు సోమవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో చలో సీతంపేట ఐటిడిఎ కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఐటిడిఎ పరిధిలోని గిరిజనులు సీతంపేటలో గిరిజన సంఘం కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఐటిడిఎ వరకు ర్యాలీ చేపట్టి, కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. గిరిజనుల నినాదాలతో ఐటిడిఎ హోరెత్తింది. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు, సీనియర్ నాయకులు ఎం.తిరుపతిరావు మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు నిర్వహించాల్సిన ఐటిడిఎ పాలకవర్గ సమావేశాలు రెండేళ్లుగా నిర్వహించక పోవడం దారుణమన్నారు. ఏజెన్సీలో 500కు పైగా గిరిజన గ్రామాలు ఉన్నాయని, వీటిలో అత్యధిక గ్రామాలకు రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. గ్రీవెన్స్‌లో అధికంగా రహదారుల సమస్యలపై వినతులు రావడమే అందుకు నిదర్శనమని చెప్పారు. జల జీవన్ మిషన్ ద్వారా గిరిజన గ్రామాలల్లో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటుచేసి, తాగునీరు అందిస్తామని చెప్పినా ఎక్కడా అమలు కావడం లేదని విమర్శించారు. తాగునీరు అందక.. కలుషిత జలాలు తాగడం వల్ల టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి రోగాల బారిన గిరిజనులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వాటివల్ల గిరిజన విద్యార్థులు, గిరిజనులు మృతి చెందారని, దానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సీతంపేట ఏరియా హాస్పిటల్లో పేరుకే వంద పడకలని, ఇంకా 50 పడకల మీదే ఆసుపత్రి నిర్వహణ సాగుతోందని తెలిపారు. ఎక్కడా గృహాలు కూడా పూర్తి కాలేదని, కొన్నింటికి బిల్లులు కూడా చెల్లించలేదని చెప్పారు. ఈ సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఐటిడిఎను ముట్టడించి, ఇక్కడే వంటావార్పు కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు.

ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బిడ్డిక అప్పారావు, మాట్లాడుతూ జిఒ 3ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నాన్ షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్లో చేర్చి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం. గిరిజనుల వద్దకు డిడి అన్నదొర వచ్చి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు గిరిజనులు వినతి అందించగా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని డిడి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఎ.భాస్కర్‌రావు, సర్పంచ్ సుందరమ్మ, శ్రీరాములు, లక్ష్మణరావు, సాంబయ్య, సాయికుమార్, గంగాధర్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సాగు పట్టాల కోసం ధర్నా

పార్వతీపురం రూరల్ : ఏళ్ల తరబడి గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తొలుత స్థానిక సుందరయ్య భవనం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ మండలంలోని తానవలస, సీతంపేట, తోకుడువలస, పనసభద్ర, లచ్చన్నదొరవలస, వెలగవలస, సందివలస, ముగడవలస, వెలగవలస, డోకిశిల, బుదురువాడ, గంగాపురం, ములగ, సంఘంవలస పంచాయతీల పరిధిలో గిరిజనులు దశాబ్దాలు భూములను సాగుచేస్తున్నారని తెలిపారు. ఆ భూములకు పట్టాలు ఇంతవరకు ఇవ్వలేదని, అనేక సార్లు కలెక్టర్లు, అధికారులకు తెలియజేస్తే కాలయాపన చేస్తున్నారు తప్ప పరిష్కారం కాలేదన్నారు. అదే ప్రాంతంలో పెత్తందారులు అమ్మకాల పేరుతో తప్పుడు పత్రాలు సృష్టించి గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానికంగా ఉన్న విఆర్ఒలు, దళారులు గిరిజనులను బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ఈ ధర్నా వద్దకు తహశీల్దార్ వచ్చి, వారం పది రోజుల్లో దర్యాప్తు చేసి గిరిజలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ధర్నాలో సిపిఎం పట్టణ కార్యదర్శి జి.వెంకటరమణ, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.రామస్వామి, మండల నాయకులు పి.రాము, గిరిజన నాయకులు డి.రాము తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట.. ర్యాలీగా వస్తున్న ఆదివాసీలు



కలెక్టర్లు, అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

బోధవ్యాధి వ్యాప్తి చెందకుండా చర్యలు

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి-పార్వతీపురం

బలిజిపేట మండలం పెదపెంకిలో బోధ వ్యాధి వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అన్నారు. సోమవారం విజయనగరం జిల్లా గుర్ల మండలంలో అతిసార ప్రబలిన ప్రాంతాల్లో పర్యటించిన ఉపముఖ్యమంత్రి.. విజయనగరం జిల్లా కలెక్టరేట్‌లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ 2016-17లో బలిజిపేట మండలంలో పర్యటించినప్పుడు ఈ సమస్య తమ దృష్టికి వచ్చిందన్నారు. బోధవ్యాధి వ్యాప్తి చెందకుండా పరిసరాల పరిశుభ్రత, ఇతర ఆరోగ్య పరిస్థితుల చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో పారిశుధ్య కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టామని వివరించారు. తాగునీటి పథకాల వద్ద శుభ్రపరిచి క్లోరినేషన్ చేస్తున్నట్లు చెప్పారు. పెదపెంకిలో ప్రత్యేక చర్యలు చేపట్టడమే కాకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. 19 రౌండ్లు మందులు సరఫరా చేశామని, మైక్రో ఫైలేరియా లార్వా సర్వే చేయించుటకు ప్రణాళికలు తయారు చేశామని వెల్లడించారు.

తుపాను పట్ల అప్రమత్తం

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-పార్వతీపురం

తుపాను పట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశాలు జారీచేశారు. వాతావరణ శాఖ సూచనల మేరకు 23 నుంచి ఉత్తరాంధ్రలో తుపాను మూలంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. ఈ మేరకు సోమవారం జిల్లా, మండల అధికారులను అప్రమత్తం చేశారు. వర్షాలు, వరదల పరిస్థితిని గమనించాలని చెప్పారు. వసతి గృహాలను తనిఖీ చేయాలని, శిథిలావస్థలో ఉన్న భవనాలలో ఎవరూ ఉండరాదని ఆదేశించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు సమాచారం అందించాలని సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా, దిగకుండా సూచనలు చేయాలని తెలిపారు. అటువంటి ప్రదేశాల్లో సిబ్బందిని ఏర్పాటు చేయడం, సూచనల బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విపత్తులు సంభవించే అవకాశాలున్న ప్రదేశాల వద్ద పూర్తి అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. విపత్తుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గతంలో జరిగిన విపత్తుల పరిస్థితిని గ్రామాల్లో తెలుసుకుని పక్కా ప్రణాళికలు తయారు చేసి సమర్పించాలని ఆదేశించారు. రహదారులపై ఉన్న పెద్ద గతకల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అటువంటి చోట్ల నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి, సిహెచ్‌డబ్ల్యులతో సహా ఎవరూ ప్రధాన కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని సూచించారు. రైతులకు పంటల పట్ల తగు సూచనలు సలహాలు ఇవ్వాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జల వనరుల శాఖ వివిధ రిజర్వాయర్లలో నీటి పరిస్థితి, నీటి ప్రవాహ పరిస్థితి ఎప్పటికప్పుడు గమనించాలని ఆయన సూచించారు.

మాజీ సైనికుల సంక్షేమానికి సలహాలివ్వండి

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలోని మాజీ సైనికులు, వితంతు మాజీ సైనికుల సంక్షేమం కోసం తగిన సూచనలు, సలహాలను ఈ నెల 31వ తేదీలోగా తమకు అందజేయాలని విజయనగరం జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎం.కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. మాజీ సైనికుల సమస్యల సత్వర పరిష్కారం కోసం వచ్చే నెల మొదటి వారంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా సైనిక బోర్డు సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. జిల్లా సైనిక బోర్డు, పార్వతీపురం మన్యం ఉపాధ్యక్షులు, సభ్యులు, మాజీ సైనిక సంక్షేమ సంఘాల సభ్యులు తమ సూచనలు, సలహాలను జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం, విజయనగరం వారికి ఈ నెల 31లోగా లిఖితపూర్వకంగా సమర్పించవచ్చని చెప్పారు. 8688817946 ఫోన్ నెంబరుకు వాట్సాప్, zswovzm@ gmail.comకు మెయిల్ చేయవచ్చని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

డిఎస్‌సి శిక్షణ దరఖాస్తు గడువు పెంపు

సీతంపేట : త్వరలో వెలువడనున్న డిఎస్‌సి పరీక్ష ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువును ఈనెల 25 వరకు పొడిగించినట్లు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి తదితర సెంటర్లలో 3 నెలల పాటు ఉచితంగా శిక్షణ అందిస్తారని చెప్పారు. గిరిజన అభ్యర్థులు వెంటనే జ్ఞానభూమి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బడిదేవరకొండపై ప్రభుత్వ ప్రకటన బాధితులను మభ్యపెట్టేందుకే

మైనింగ్ ఎడి ద్వంద వైఖరి మానుకోవాలి ● విలేకరుల సమావేశంలో పరిరక్షణ కమిటీ హెచ్చరిక

ప్రజాశక్తి-పార్వతీపురం

బడిదేవరకొండ అక్రమ మైనింగ్ తవ్వకాలకు ఎన్ని అడ్డంకులు ఎదురైనా కార్పొరేట్ కంపెనీల పక్షాన్నే నిలుస్తామనే ఛాందసవాదాన్ని బలపరిచేలా ప్రభుత్వ ప్రకటనలు ఉన్నాయని బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ ప్రకటన బాధిత గిరిజనులను మభ్యపెట్టేలా ఉందని, మైనింగ్ ఎడి ద్వంద వైఖరి మానుకోవాలని హెచ్చరించారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో బడిదేవరకొండపై జిల్లా గనుల, భూగర్భ శాఖ అధికారి అనుచిత ప్రకటనను ఖండిస్తూ కొండపరిరక్షణ కమిటీ సభ్యులు విలేకరుల సమావేశం లేర్పాటు చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ షెడ్యూల్ ఏరియాలో బడిదేవరకొండ ఉందని, 2016లో విజయనగరం జిల్లా కలెక్టర్ సమక్షంలో మైనింగ్ తవ్వకాలకు అనుమతులు లేవని, అటవీశాఖ, రెవెన్యూ ఫారెస్ట్ ఉమ్మడి సర్వేలో రిజర్వ్ ఫారెస్ట్‌దేనని నిర్ధారణ అయిందని గుర్తుచేశారు. కొండ తవ్వకాలకు లైసెన్స్ రద్దు చేయాలని, కొండపై జీవనాధారం పొందుతున్న గిరిజనులకు అటవీ హక్కు చట్టం ప్రకారం పోడు పట్టాలు కూడా ఇవ్వాలని 2017లో అధికారులు ఆదేశించారని చెప్పారు. నేడు మరలా అదే కొండ తవ్వకాలకు లైసెన్స్ పునరుద్ధరణ చేయడం విడ్డూరంగా ఉందని తెలిపారు. గతంలో చట్ట ప్రకారంగా లీజు లైసెన్సులు రద్దు చేసిన ప్రభుత్వం.. నేడు ఏ చట్ట ప్రకారంగా లైసెన్సులు ఇచ్చారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా గనులు, భూగర్భ శాస్త్ర జిల్లా అధికారి జి.జయప్రసాద్ ప్రకటన అనుచితంగా ఉందని, కొండ మైనింగ్ తవ్వకాల విషయంలో ద్వంద వైఖరి అనుసరించడం సరైనది కాదని అన్నారు. కొండ రెండు భాగాలుగా లేదని, ఒకే భాగంగా తొలి నుంచీ రిజర్వ్ ఫారెస్ట్‌లోనే ఉన్నట్లు ఆనాడే కమిటి నిర్ధారించిందని స్పష్టంచేశారు. నేడు అధికారులే దానిని రెండు భాగాలుగా విభజించి తప్పుడు సమాచారంతో ప్రజలను నమ్మించి, మోసగించే ప్రకటనలు విడుదల చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్పొరేట్ మైనింగ్ శక్తులకు వత్తాసు పలకడం అన్యాయమని, ఈ చర్యను వెంటనే మానుకోవాలని సూచించారు. వెంటనే మైనింగ్ లీజు లైసెన్స్ రద్దు చేయాలని, కొండ క్రాఫిక్ పనులు ఆపాలని, లేకుంటే భవిష్యత్తులో కమిటీ, ప్రజల ఉద్యమాలు మరింత ఉధృతంగా ఉంటాయని హెచ్చరించారు.

అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి కె.మన్మథరావు మాట్లాడుతూ ప్రకృతిని ధ్వంసం చేసే శక్తి ఎవరికీ లేదని చెప్పారు. ప్రభుత్వం అటువంటి చర్యలకు పాల్పడితే పెద్ద ఎత్తున మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. గిరిజన సంపదను కొల్లగొట్టడం అన్యాయమని మండిపడ్డారు. వెంటనే లీజు లైసెన్సులను ఉపసంహరించుకోవాలని, ఎడి జయప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు పి.శ్రీనునాయుడు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.నర్సింగరావు, గిరిజన సంక్షేమ సంఘం కన్వీనర్ పి.రంజిత్ కుమార్, ఎఐటియుసి నాయకులు ఆర్‌విఎస్ కుమార్, చెరువుల సంరక్షణ కమిటీ నాయకులు వంగల దాలినాయుడు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, గిరిజన సంఘం నాయకులు కె.రామస్వామి, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ఎస్.విశ్వేశ్వరరావు తదితరులు మాట్లాడారు.

నేర రహిత జిల్లాగా పార్వతీపురం

పోలీస్ అమరుల సంస్మరణ దినోత్సవ సభలో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జిల్లాలో పోలీసుల సేవలను పూర్తిగా వినియోగించుకొని శాంతిభద్రతలకు మారుపేరుగా, నేరరహిత జిల్లాగా పార్వతీపురం రూపుదిద్దుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆకాంక్షించారు. జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో పోలీస్ అమరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమం సోమవారం ఉదయం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఘనంగా జరిగింది. విధి నిర్వహణలో ప్రాణాలు విడిచిన పోలీస్ అమరులను స్మరించుకుంటూ ఎస్‌పి ఎస్.వి.మాధవ్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎండ, వాన, రాత్రి, పగలు, పండుగలు.. అనే తేడా లేకుండా ప్రజల కోసం జీవిస్తూ, ప్రజల ప్రాణాల భద్రత కోసం పోలీసులు చేస్తున్న త్యాగాలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. శాంతి భద్రతలను కాపాడుతూ, వారి ఆరోగ్యాలను కూడా పట్టించుకోకుండా పోలీసులు విధులు నిర్వహిస్తుంటారని చెప్పారు. గంజాయి అక్రమ రవాణా, నాటుసారా, సైబర్ నేరాలు వంటివి దృష్టికి వస్తే, వాటిపై తక్షణం పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఇటీవల కాలంలో మహిళలపై అకృత్యాలు, దాడులు జరుగుతున్నట్లు వింటున్నామని తెలిపారు. ఇందుకోసం మహిళా పోలీస్ స్టేషన్లు, కౌన్సిలింగ్ వ్యవస్థ ఉందని, నేరం జరిగిన వెంటనే నేరస్తులను పట్టుకుంటారని కలెక్టర్ తెలిపారు.

ఎస్‌పి మాధవ్ రెడ్డి మాట్లాడుతూ మృత్యువు అడుగు దూరంలో ఉన్నా, అసమాన పోరాటం చేసి ముందడుగు వేసి, అశువులు బాసిన పోలీసులు ఎందరో ఉన్నారని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసి మన మధ్య జీవించి లేకపోయినప్పటికీ, మన మనసులో స్ఫూర్తిగా జీవించే ఉంటారని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లాలో అమరులైన ముద్దాడ గాంధీ, బి.శ్రీరాములు త్యాగాలకు గుర్తుగా, వారి కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్, ఎఎస్‌పి సురాన అంకిత మహావీర్, అమరవీరుల కుటుంబసభ్యులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





పోలీస్ అమరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ; అమరుల కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

గ్రీవెన్స్‌కు 146 వినతులు


పిజిఆర్ఎస్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి : జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-పార్వతీపురం

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 146 వినతులు అందాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌కు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి ప్రతి జిల్లా అధికారి విధిగా హాజరు కావాలని ఆదేశించారు. వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి, సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. వచ్చిన అర్జీల వివరాలు ఇలా ఉన్నాయి..

బలిజిపేట మండలం అరసాడ గ్రామానికి చెందిన పి.శేషగిరి తనకు బ్యాటరీ వాహనం మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు.

పార్వతీపురం మండలం విశ్వంభరపురం గ్రామానికి చెందిన పి.మహేశ్వరరావు పింఛను మంజూరు చేయాలని కోరుతూ వినతినిచ్చారు.



అర్జీలను స్వీకరిస్తున్న జెసి శోబిక

20 ఏళ్ల క్రితం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి సొంత స్థలాన్ని విరాళంగా ఇచ్చినందుకు, ఏదో ఒక ఉద్యోగం ఇస్తామని అప్పటి అధికారి హామీ ఇచ్చారని, ప్రస్తుతం పిహెచ్‌సిలో ఖాళీగా నైట్ వాచ్‌మేన్ పోస్ట్ తనకు ఇవ్వాలని జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురం గ్రామానికి చెందిన బి.లలితకుమారి కోరారు.

బలిజిపేట మండలం వంతరాం గ్రామానికి చెందిన బి.సింహాచలం.. సర్వే నెంబర్ 116లో ఉన్న దత్తేశ్వరం చెరువు ఆక్రమణకు గురైందని, విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

పార్వతీపురం మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన పి.రామారావు గత ప్రభుత్వ హయాంలో తన భూమికి రీసర్వే చేసినా, ఇంతవరకు పట్టాదారు పాస్ బుక్ మంజూరు చేయలేదని అర్జీ అందజేశారు.

గరుగుబిల్లి మండల కేంద్రంలో ఆధార్ కేంద్రాన్ని పునఃప్రారంభించాలని కోరుతూ అదే గ్రామానికి చెందిన ఎ.రాజ్‌కుమార్ అర్జీని అందజేశారు.

కురుపాం గ్రామానికి చెందిన జి.గౌరీశ్వరి పశువుల శాలకు అనుమతి ఇప్పించాలని కోరారు.

వి.డి డిగ్రీ కాలేజ్ వెనుక ఉన్న పంట పొలాలను పందులు నాశనం చేస్తున్నాయని, సంబంధిత యాజమాన్యానికి చెప్పి పందులను కట్టడి చేయాలని కోరారు.

పార్వతీపురం మండలం క్రిష్ణపల్లి పంచాయతీలోని పార్వతీనగర్, వరహాలగెడ్డకు ఆనుకుని ఉన్న శ్మశానవాటిక పునర్నిర్మాణం, కాంపౌండ్ వాల్‌ని ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్తులు ఆర్జీ పెట్టుకున్నారు.

గరుగుబిల్లి మండలం రావివలస గ్రామస్తులు తమ గ్రామంలో ప్రతి మూడు రోజులకు 10 నుంచి 18 గంటలు కరెంటు ఉండడం లేదని, ఒకవేళ కరెంటు ఉన్నప్పటికి లోఓల్టేజ్ ఉంటుందని, పంచాయతీలో సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. పంచాయతీలో ఉన్న కరెంటు స్తంభాలు గాలులకు, తుపాన్లకు పాడై విరిగిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని, కొత్తవి వేయాలని కోరారు.

వినికిడి పరికరాలను అందజేసిన జెసి

వినికిడి లోపం ఉన్న తమకు పరికరాలను అందించాలని పార్వతీపురం మండలం కలవరిపేటకు చెందిన వడ్లమాని ప్రసాదరావు, పాలకొండ మండలం గోపాలపురానికి చెందిన కలివరపు నందీశ్వరరావు, వీరఘట్టం మండలం సత్తలకవిటికి చెందిన కొత్తవలస రమణమ్మ జెసికి అర్జీలను అందజేశారు. వారికి వినికిడి పరికరాలను తక్షణమే అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జి.కేశవ నాయుడు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ గ్రీవెన్స్‌కు 87 వినతులు

సీతంపేట : సీతంపేట ఐటిడిఎలో డిడి అన్నదొర, పిహెచ్ఒ గణేష్ ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 87 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ పి.నారాయడు, ఎపిడి సన్యాసిరావు, డిఇ గోపాల్‌కృష్ణ, సిడిపిఒ రంగా లక్ష్మి, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి జాకబ్ దయానంద్, ఎఎంఒ కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణ చర్యలు : ఎస్‌పి

పార్వతీపురం రూరల్ : గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి మాధవ్‌రెడ్డి.. పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకొన్నారు. సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, విచారణ చేసి, చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని ఎస్‌పి సూచించారు. తీసుకున్న చర్యలపై నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ వి.వి.సి.ఎం ఎర్రన్నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



పెదబొండపల్లిలో వరి పంటను నాశనం చేసిన ఏనుగులు

పెదబొండపల్లిని వీడని గజరాజుల గుంపు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

15 రోజుల క్రితం మండలంలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు.. రెండు రోజులుగా పెదబొండపల్లి పరిసరాల్లో తిష్టవేశాయి. వరి పంట చేతికి అందుతున్న సమయంలో రాత్రిపూట ఏనుగులు పొలాల్లోకి దిగి పంటలను నాశనం చేస్తున్నాయి. దీనివల్ల గ్రామంలోని రైతులు కంటికి కునుకు లేకుండా, ఏ క్షణాన ఎవరి పొలాల్లో చొరబడతాయోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులను తరలించే ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఏనుగుల సంచారంపై ఫారెస్ట్ అధికారి మనోజ్ కుమార్, రూరల్ ఎస్ఐ సంతోషికుమారి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు.

పెదగొడబ గ్రామస్తులపై కేసులు

ప్రజాశక్తి-గరుగుబిల్లి

మండలంలోని చినగొడబ రెవెన్యూ పరిధిలో నిర్వహిస్తున్న అచ్చుం మైనింగ్ తవ్వకాలకు సంబంధించి లారీలను అడ్డుకున్న పెదగొడబ గ్రామస్తులపై పోలీసులు కేసు నమోదుచేశారు. అచ్చుం మైనింగ్ కంపెనీ ప్రతినిధి అచ్చుం నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్‌నాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టినట్లు చెప్పారు.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే లక్ష్యం

ప్రజాశక్తి -భామిని

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే యుటిఎఫ్ లక్ష్యమని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఆరికి భాస్కరరావు తెలిపారు. మండలంలోని అత్తికొత్తూరు పాఠశాలలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు తిరుపతిరావు అధ్యక్షతన యుటిఎఫ్ స్వర్ణోత్సవ సమావేశాన్ని నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి కె.ప్రసాద్ కార్యదర్శి నివేదికను, కోశాధికారి బి.మహేష్ ఆర్థిక నివేదికను ప్రవేశ పెట్టారు, అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బి చిన్నారావు. అధ్యక్షులుగా ఇ.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శిగా కద్రక ప్రసాద్, సహాధ్యక్షులుగా టి.సుధారాణి, పి.తిరుపతిరావు, కోశాధికారిగా బి.మహేష్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఆరిక భాస్కరరావు, ఎన్నికల పరిశీలకులుగా బి.జయప్రకాశ్ వ్యవహరించారు.



విద్యార్థులను అభినందిస్తున్న డివిఇఒ మంజులవీణ

రాష్ట్ర స్థాయి పోటీలకు
జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-కొమరాడ

ఈ నెల 23న జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు డివిఇఒ మంజులవీణ తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి కళ్లికోట పవన్ కుమార్, పండిత పవన్‌కుమార్ ఎంపికైనట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటాలని ఆకాంక్షించారు. అనంతరం కళాశాల రికార్డులను ఆమె తనిఖీ చేశారు.

23న జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక

ప్రజాశక్తి-పార్వతీపురం

ఈనెల 23న జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సంబంధించిన అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికలు జరుగనున్నాయి. అండర్ 14, అండర్ 17, అండర్ 19 పోటీలకు ఎంపికలను వెంకంపేట మైదానంలో నిర్వహించనున్నారు. రన్నింగ్, లాంగ్ జంప్, హై జంప్ క్రీడల్లో ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు మైదానాన్ని ప్రభుత్వ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు సిద్ధం చేస్తున్నారు.

గోపాలపురంలో పోలీస్ పికెట్

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మండలంలోని గోపాలపురంలో పోలీసు పికెట్ సోమవారం కొనసాగింది. ఈ గ్రామానికి చెందిన యువకుడి ఆత్మహత్యపై తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తంచేస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదుచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎఎస్‌పి అంకిత ఏర్పాటుచేసిన పోలీస్ పికెట్ నాలుగు రోజులుగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ సంతోషికుమారి గ్రామంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు.

గ్రామసభకు 74 దరఖాస్తులు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని ఆడారు గ్రామంలో సోమవారం రీసర్వే భూ సమస్యల పరిష్కారానికి 74 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహశీల్దార్ ప్రసాదరావు తెలిపారు. ఇందులో భాగంగా రీ సర్వేలో భూమి తక్కువ వచ్చిందని, మ్యుటేషన్లు, పేర్లు మార్చాలని, తదితర వాటికి దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ, గ్రామ సర్వేయర్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే విత్తనాలు

ప్రజాశక్తి-మక్కువ

రైతులు రబీ సాగులో అపరాలు విత్తనాలు పొందాలంటే ఆయా రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. సాధారణ రైతులకు 30 శాతం, ఎస్‌సి, ఎస్‌టి రైతులకు 90 శాతం రాయితీపై ప్రభుత్వం విత్తనాలను పంపిణీ చేయనుందని చెప్పారు.

శంబంగికి రాజన్నదొర పరామర్శ

ప్రజాశక్తి-సాలూరు

బొబ్బిలి మాజీ మాజీ శంబంగి వెంకట చిన అప్పలనాయుడు వదిన, విశాఖ డెయిరీ బోర్డు సీనియర్ డైరెక్టర్ శంబంగి అమ్మలు అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర సోమవారం బొబ్బిలి మండలం పక్కి గ్రామానికి వెళ్లి శంబంగి కుటుంబాన్ని పరామర్శించారు. అమ్మలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.. ఆయన వెంట వైసిపి నాయకులు మావుడి రంగునాయుడు, దండి శ్రీనివాసరావు, తాడ్డి యశోదకృష్ణ తదితరులు ఉన్నారు.

ఖాళీప్లేట్లతో లారీ డ్రైవర్ల నిరసన

ప్రజాశక్తి-కొమరాడ

కొమరాడలో అంతర్రాష్ట్ర రహదారిపై సిపిఎం ఆధ్వర్యాన లారీ డ్రైవర్లు సోమవారం ఖాళీ ప్లేట్లు పట్టుకుని నిరసన చేపట్టారు. కొమరాడ మండల కేంద్రంలో నిలిచిపోయిన లారీల వద్ద అధికారులు, ప్రభుత్వ తీరుపై నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ 72 గంటలుగా లారీలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నా అధికారులకు పట్టడం లేదని మండిపడ్డారు. అంతర్రాష్ట్ర రహదారిపై ప్రయాణం చేసే వాహనదారులకు, డ్రైవర్లకు భోజనమైనా పెట్టాలని, లేకుంటే రహదారికి మరమ్మతులైనా చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ అధికారులు అసలు ఉన్నారా, లేరా? అని ప్రశ్నించారు. ఎక్కడా కనిపించరు, కనీసం పర్యవేక్షణ చేయరంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికే అనేకమంది అధికారులు మారారు తప్ప పరిష్కారం శూన్యమని ధ్వజమెత్తారు. నాలుగు సంవత్సరాలుగా సిపిఎం, లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోతులు కప్పడం తప్ప ఆర్అండ్‌బి అధికారులు చేసిందేమీ లేదని విరుచుకుపడ్డారు. ఈ రోడ్డుపై గోతులు కప్పడానికి టెండర్లు వేస్తున్నామని చెప్పడమే తప్ప టెండర్ లేదు, నిధులు లేదు, గోతులు కప్పే పరిస్థితి లేదంటూ దుయ్యబట్టారు. నాలుగు రాష్ట్రాలకు వెళ్లే ప్రధాన రహదారి గురించి పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఏళ్ల తరబడి ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం దారుణమని విరుచుకుపడ్డారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ప్రకటించిన రూ.11 కోట్లను విడుదల చేసి, పార్వతీపురం నుంచి కూనేరు మీదుగా వెళ్లే రహదారిని బాగుచేసి, ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు.



అంతర్రాష్ట్ర రహదారిపై ఖాళీప్లేట్లతో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, లారీ డ్రైవర్లు

పాఠశాల తెరిపించాలని ఆందోళన

ప్రజాశక్తి-సాలూరురూరల్

మూసివేసిన బొడ్డపాడు పాఠశాలను వెంటనే తెరిపించాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ఎంఇఒ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సీదరపు అప్పారావు మాట్లాడుతూ జిపిఎస్ పాఠశాలను మూసేయడంతో గిరిజన విద్యార్థులు చదువుకు దూరమయ్యారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి, పాఠశాలను తెరవాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వంతల సుందర్ రావు, గెమ్మెల జానకిరావు, సీదరపు తమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

23న కురుపాం మండల సమావేశం

ప్రజాశక్తి - కురుపాం

ఈ నెల 23న స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి శెట్టి పద్మావతి అధ్యక్షతన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి తెలిపారు. అధికారులు తమ శాఖకు సంబంధించిన పూర్తి సమాచారంతో సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

నైపుణ్యాన్ని వెలికితీయాలి : ఎమ్మెల్యే



జాబ్‌మేళాలో ఎంపికైన వారితో ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

యువత నైపుణ్యాన్ని గుర్తించి, వెలికి తీయాలని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర అన్నారు. సోమవారం స్థానిక శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా ఏర్పాటుచేశారు. ఈ జాబ్‌మేళాలో సుమారు 19 కంపెనీలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో నాలుగు స్కిల్ ల్యాబ్స్, ఒక స్కిల్ కాలేజ్ ఉన్నాయని తెలిపారు. నిరుద్యోగ యువతకు అర్హతను బట్టి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జీతం తక్కువ ఉన్నా, అనుభవం పెరిగితే స్థాయి, జీతం పెరుగుతాయని చెప్పారు. స్థానికంగానే ఉద్యోగం చేయాలనే కోరిక చాలా మందికి ఉంటుందని, కానీ బయట ప్రపంచాన్ని చూడాలంటే ఉద్యోగం కోసం ఎక్కడికైనా వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్‌చంద్ర తన అనుభవాన్ని యువతతో పంచుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ చలపతి రావు, జిల్లా నైపుణ్యాధికారి సాయికృష్ణ చైతన్య, అదనపు నైపుణ్యాధికారి కంచిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బిటి రోడ్డుకు శంకుస్థాపన

సీతానగరం : మండలంలోని గెడ్డలుప్పి ఆర్అండ్‌బి కూడలి నుంచి కొత్తవలస రోడ్డు వరకు బిటి రహదారికి ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర సోమవారం శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనకు పెద్దపీట వేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు పెంట సత్యం నాయుడు, రౌతు గోపాల్ నాయుడు, గొట్టాపు వెంకటనాయుడు, ఎంపిడిఒ త్రివిక్రమరావు, జెఇ చంద్రమౌళి, ఉప తహశీల్దార్ ఉమామహేశ్వరరావు, ఎపిఎం శ్రీరాములు నాయుడు, ఎపిఒ భాను, గరికయ్య, జనసేన మండల అధ్యక్షుడు పాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపడాలి

పార్వతీపురం టౌన్ : పారిశుధ్య నిర్వహణపై పనితీరు బాగోలేదని ఫిర్యాదుల వస్తున్నాయని, మెరుగు పరుచుకోవాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మున్సిపల్ కార్మికులకు సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల మస్టర్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులతో ప్రతిజ్ఞను చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ తీరు మారకుంటే, తానే మారుతానని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని కోరారు.



నిరసన చేపడుతున్న నిర్వాసిత సంఘం నాయకులు, నిర్వాసిత మత్స్యకారులు

పెద్దగెడ్డ నిర్వాసితుల నిరసన

ప్రజాశక్తి-పాచిపెంట

పెద్దగెడ్డ జలాశయ నిర్వాసిత మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మడవలస, తురాపాడు గ్రామాల వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పెద్దగెడ్డ జలాశయం నిర్వాసిత సంఘం నాయకులు కోరాడ ఈశ్వరరావు, సుకురు రామారావు మాట్లాడుతూ జలాశయంలో భూములు కోల్పోయి ఏ ఆధారమూ లేని నిరుపేద గిరిజనులకు, యువకులకు ఆర్ఆర్ ప్యాకేజీ ఇస్తామని ప్రకటించి నేటికీ ఇవ్వకపోవడం దారుణమన్నారు. దీంతో బతుకు తెరువు కోసం వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధునాతనమైన వలలు పంపిణీ చేయాలని, లైఫ్ జాకెట్లు, బోట్లు ప్రభుత్వం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. చేప పిల్లల పంపిణీ చేసి, పట్టుకునేందుకు నిర్వాసిత మత్స్యకారులకు అవకాశం కల్పించాలని కోరారు.

కార్యక్రమంలో నిర్వాసితులు కిరసాన దుర్గరాజు, బంటు సింహాచలం, కొట్టిసి నారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి దావాల రమణారావు

పక్కా ప్రణాళికతో ఆరోగ్య కార్యక్రమాలు



వ్యాక్సిన్‌ను తనిఖీ చేస్తున్న ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

ప్రగతి నివేదికలు పురోగతి చెందేలా పక్కా ప్రణాళికతో ఆరోగ్య కార్యక్రమాలను నిర్వహించాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు స్థానిక పిహెచ్‌సిని సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు నమోదు, ఆరోగ్య వివరాల రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన పలు ఆరోగ్యకార్యక్రమాల నిర్వహణ తీరు ఏ మేరకు ఉందో సంబంధిత ప్రగతి నివేదికలను పరిశీలించారు. ప్రసవాలు గదిని, కాన్పుల రికార్డు పరిశీలించారు. పిహెచ్‌సిలో ప్రసవాలపై దృష్టిసారించాలన్నారు. వ్యాక్సిన్ నిల్వలు తనిఖీ చేశారు. అనంతరం పిహెచ్‌సికి వచ్చిన రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సాగర్ వర్మ, డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారి(డిఎస్ఒ) శంకర్, సూపర్‌వైజర్లు చిన్నమ్మి, రవణమ్మ, ఉదయకుమారి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు

బలిజిపేట : వ్యాధుల నివారణకు క్షేత్ర స్థాయి సిబ్బంది పక్కా ప్రణాళికలతో చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్ తెలిపారు. మండలంలోని పెదపెంకి గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. ఫైలేరియా వ్యాధి గ్రస్తులను కలిసి నివారణ చర్యలపై వైద్య సిబ్బందికి సలహాలు ఇచ్చారు. అనంతరం సర్పంచ్ నగిరి పాపారావుతో కలిసి పారిశుధ్యాన్ని, కాలువలను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీధర్, కిరణ్మయి, పంచాయతీ కార్యదర్శి తిరుపతిరావు పాల్గొన్నారు.

సాగునీరు అందించాలని ధర్నా

ప్రజాశక్తి-పాలకొండ

తోటపల్లి ఎడమ కాలువ ఆయకట్టుకు సాగునీరు అందించాలని సోమవారం రైతులు ఇరిగేషన్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి దావాల రమణారావు మాట్లాడుతూ మండలంలో తోటపల్లి కాలువ శివారు ప్రాంతాలకు నేటికీ ఒక్క చుక్క నీరు అందలేదని చెప్పారు. ఇంతవరకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. 7, 8 బ్రాంచుల కింద రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సకాలంలో సాగునీరు అందించకపోతే రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు.

ఆయకట్టు రైతుల ప్రతినిధి కండాపు ప్రసాద్ మాట్లాడుతూ 8వ బ్రాంచ్ కిందున్న ఆయకట్టుకు నీరు అందించాలన్నారు. అనంతరం ఇరిగేషన్ ఎఇ శంకర్‌రావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కరణం అప్పారావు, సోమశేఖర, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

ప్రజాశక్తి - కురుపాం :

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కురుపాం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్య జోసెఫ్ అన్నారు. సోమవారం కురుపాంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల, మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాల, గురుకుల పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్లో వంట గదులు, వండిన భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాల సిబ్బందితో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. మరుగుదొడ్లు, పాఠశాల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ కె.సూర్యనారాయణ, ప్రిన్సిపల్ సత్యనారాయణ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



బియ్యం తనిఖీ చేస్తున్న జడ్జి సౌమ్య

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని ఐటిడిఎ డిప్యూటీ డిఎంహెచ్ఒ కెవిఎస్ పద్మావతి తెలిపారు. సోమవారం కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం గుమ్మలక్ష్మీపురంలోని గర్భిణుల వసతిగృహాన్ని సందర్శించారు. సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య ఉద్యోగుల జిల్లా వైస్ ప్రెసిడెంట్ జె. తిరుపతిరావు, సభ్యులు వినోద్, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ పద్మావతి



కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న ఎఒ తిరుపతిరావు

దశపత్ర కషాయంతో పురుగుల నివారణ

ప్రజాశక్తి-పాచిపెంట

దశపత్ర కషాయం అన్ని రకాల కాయతొలుచు, ఆకుతినే పురుగులను నివారిస్తుందని ఎఒ తిరుపతిరావు తెలిపారు. మండలంలోని పొలంవలస గ్రామంలో రైతులకు దశపత్రం కషాయం తయారీ, ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ప్రకృతి సేద్య ఎల్‌వన్ సురేష్ కుమార్‌తో కలిసి ప్రకృతి సేద్య పంటలను పరిశీలించారు

యువత శ్రమదానం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠాపురం పంచాయతీలోని దండుసుర గ్రామ యువత సోమవారం శ్రమదానం చేపట్టారు. నరేష్, తేజేశ్వరరావు, సూరయ్య ఆధ్వర్యాన నీలకంఠాపురం ఘాట్ రోడ్ నుండి దండుసుర వరకు ఇరువైపులా ఉన్న జంగిల్‌ను తొలగించారు. దండుసుర పాఠశాల ఉపాధ్యాయులు బి.శంకర్రావు, ఫీల్డ్ అసిస్టెంట్ పోతయ్య సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పైపు బెండు కాదు.. పాము

ప్రజాశక్తి-మక్కువ

ఈ చిత్రంలో మీరు చూస్తున్నది బెండున్న పైపు అనుకుంటే పొరపడినట్లే.! పైపు రంగును పోలి పడగ విప్పిన ఆ పామును చూసి స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సోమవారం మండలంలోని చెముడు గ్రామంలో ఈ చిత్రం కనిపించింది. కరణం మహేశ్వరరావు ఇంటి పనిచేసి, మిగిలిపోయిన పైపు ముక్కను బయటపడేశాడు. ఆ పైపులోకి నాగుపాము ఎప్పుడు చేరిందో తెలియదు గానీ.. స్థానికుల సంచారాన్ని గమనించి పైపులో నుంచి ఒక్క ఉదుటన బయటకు వచ్చి పడగ విప్పింది. దీంతో భయాందోళనకు చెందిన స్థానికులు కేకలు వేశారు. కొద్దిసేపటి తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆరు బయటపడేసే వస్తువుల దగ్గరికి వెళ్లేముందు కొంచెం జాగ్రత్త వహించాలని ఈ సంఘటన రుజువు చేస్తుంది.



పైపులో ఉన్న నాగుపాము



జెండాను ఎగురవేస్తున్న ఎఐఎస్‌ఎఫ్ నాయకులు

మన్యంలో సిటియు ఏర్పాటు చేయాలి
ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు

ప్రజాశక్తి-పార్వతీపురం

మన్యం జిల్లాలో కేంద్రీయ గిరిజన యూనివర్సిటీని ఏర్పాటుచేయాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి జాన్సన్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఐఎస్‌ఎఫ్ మన్యం జిల్లా ప్రథమ మహాసభ సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం కేంద్రంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థుల మృతిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని కోరారు. పెండింగ్లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్లు తక్షణమే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగభూషణం, రవికుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.